క్లుప్తంగా

17వ తేదీ వరకు ఒంటిపూట బడులు

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు 12 నుంచి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కాగ ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపద్యంలో ఈ నెల 17వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. పాఠశాలలు ఉదయం 7.30 గం.ల నుంచి 11.30 గం.ల వరకు నిర్వహించబడుతుందన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థులకు 11.30 నుంచి 12 గం.ల వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని హెచ్ఎంలకు సూచించామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, కస్తూర్బా, ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏపి మోడల్ స్కూల్, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు అన్నీ కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఉత్తర్వులను అమలు చేయని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంఈఓ హెచ్చరించారు.

పాఠశాలలు పునఃప్రారంభం

దాచేపల్లి : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమైయ్యాయి. వేసవి సెలవుల తరువాత పాఠశాలల తలుపులు తెరచుకున్నాయి. ఉదయం7 గంటలకే ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలకు చేరుకున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పాత కొత్త కలయికతో కళకళలాడాయి. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పాఠాలు బోధించారు. యధాప్రకారం పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు చేశారు.

బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులు



దాచేపల్లి : ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా దాచేపల్లి మండలానికి పలువురు ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా ప్రసాదరావు, తంగెడ హైస్కూల్ హెచ్ఎంగా నరసింహారావు, పెదగార్లపాడు హైస్కూల్ హెచ్ఎంగా శ్రీనివాసరావు, రామాపురం హైస్కూల్ హెచ్ఎంగా పఠాన్ జానీభాషా, ముత్యాలంపాడు హైస్కూల్ హెచ్ఎంగా జ్యోతి, మాదినపాడు హైస్కూల్ హెచ్ఎంగా రమణ బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా హైస్కూల్స్‌తో పాటుగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు కూడా బదిలీలపై ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

పొలంబాటకు మహర్దశ

శావల్యాపురం: వేల్పూరు, కారుమంచి గ్రామాల్లో పొలాలకు లింకు రోడ్లు మరమ్మతుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు పనులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఇరువురి సహకారంతో గత కొన్ని సంవత్సరాల నుంచి నెలకొనియున్న సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. వేల్పూరు గ్రామ పంచాయతీలో 10 కిలోమీటర్ల మేర పనులు తుది దశకు చేరినట్లు చెప్పారు. మండలంలోని కారుమంచి గ్రా మం ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక నుంచి పొలాలకు వెళ్లే రహదారి పనులు 3 కిలోమీటర్ల మేర జెడ్పీ, మండల నిధులతో జరుగుతున్నాయన్నారు.

రహదారి దాటుతూ మహిళ దుర్మరణం

చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం నాయకుడు కందుల శ్రీకాంత్ మాతృమూర్తి కందుల లక్ష్మి (55) మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బయ్యతోటలో నివాసం ఉండే కందుల శ్రీలక్ష్మి ప్రతిరోజూ ఉదయాన్నే పండరీపురంలోని ఓ మెడిటేషన్ సెంటర్‌కు వెళతారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయాన్నే మెడిటేషన్ సెంటర్‌కు వెళ్లేందుకు విజయా బ్యాంకు సెంటర్‌లో జాతీయ రహదారి దాటుతున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న తమిళనాడుకు చెందిన కంటైనర్ లారీ ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం స్వగృహానికి తరలించారు. మృతురాలికి భర్త శ్రీనివాసరావు, ముగ్గురు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఫోన్‌లో కందుల శ్రీకాంత్‌కు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కాట్రగడ్డ మస్తాన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, పఠాన్ తలహాఖాన్ తదితరులు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

ఎలాంటి విద్యుత్ కోతలు లేవు

చిలకలూరిపేట: నియోజకవర్గ పరిధిలో ఎలాంటి విద్యుత్ కోతలు లేవని విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. వాతావరణ మార్పుల దృష్ట్యా శని, ఆదివారాల్లో ఉరుములు, మెరుపులు, గాలి దుమారం కారణంగా విద్యుత్ తీగలు తెగుట, విద్యుత్ స్తంభాలు విరిగి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అక్కడక్కడా అంతరాయం ఏర్పడిందని తెలిపారు. వా ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే ఏఈఈలను సంప్రదించాలని కోరారు.

తొలి రోజే విద్యాకానుకల ఆనందాలు

గురజాల : రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్ద పీట వేస్తూ పాలన అందిస్తున్నారని నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ షేక్ బడేజానీ అన్నారు. స్థానిక జిబిసీ కాలనీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బడేజానీ మాట్లాడుతూ గత ప్రభుత్వాలతో పోల్చితే ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పిల్లలకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో నాడు–నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. గతంలో తరగతి గదులు బూత్ బంగ్లాల్లా దర్శనమిచ్చేవని కానీ నేడు ఆ పాఠశాలలను కార్పొరేట్ స్థాయి హోదా పెరిగే విధంగా వాటి రూపురేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అదే విధంగా పాఠశాలల్లో చిన్నారులకు జగనన్న విద్యా కానుక పేరుతో రెండు జతల యూనిఫాం, బూట్లు, బెల్టు, వంటివాటితో పాటు పాఠ్యపుస్తకములు, నోట్ పుస్తకాలు అందించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. పాఠశాల ప్రారంభం రోజే ఈ విధంగా అందించడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకుని పాఠశాలకు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ విప్ కుక్కమూడి అనిల్‌కుమార్, కౌన్సిలర్ కత్తి రమాదేవి రవి, ముస్లీం మైనార్టీ మండల నాయకుడు షేక్ నాగులుమీరా (నాగుల్‌మేస్త్రీ), గృహ సారథులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

4,238 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక

రెంటచింతల: రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలతో పాటు వివిధ సమాజిక వర్గాల పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తూ కృషి చేస్తున్నట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాభివృద్ధి ద్వారానే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని సీఎం జగన్ పాలనలో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ ఐ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ, కస్తూర్బా, ఏపి మోడల్, ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన 4,238 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలలో చదువుతున్న ఒక్కొక్క విద్యార్థికి రూ.2500 విలువైన నోట్ బుక్స్, వర్క్ బుక్స్, యూనిఫాం, ఒక జత బూట్లు, రెండు జతల సాక్స్‌లు, బెల్టు, స్కూల్ బ్యాగు, ఇంగ్లిషు, తెలుగు డిక్షనరీలు అందచేయడం జరుగుతుందన్నారు. సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రెంటచింతలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను అందజేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య

మాచవరం: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జెడ్పీటీసీ జె.శివాయాదవ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నతమైన, నాణ్యమైన విద్యను అందించేందుకు, ప్రతి ఒక్కరికీ విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రోత్సహిస్తూ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, స్కూల్ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలి రోజే విద్యా కానుక అందజేత

పిడుగురాళ్లరూరల్: గతంలో ఎన్నడు లేని విధంగా పాఠశాల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు విద్యా కానుకను అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ యర్రంరెడ్డి వీరారెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాట వేస్తూ వారు చదువుల భారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన భుజానికి ఎత్తుకున్నారని వారు అన్నారు. విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, షూస్, బెల్టు, స్కూల్ బ్యాగ్, రెండు జతల సాక్స్‌లు, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, డిక్షనరీలు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. అరుణ్‌కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బాసటగా

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ జాని, ఉప్పు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పిస్తున్నారని వారు అన్నారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్ దేవల నాగరాజు, వేముల బాబురావు, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఇర్ల గురవమ్మ, హెచ్ఎం నాగేశ్వరరావు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభం కాక ముందే జగనన్న విద్యాకానుకలు పాఠశాలలకు చేరుకున్నట్లు ఎంఈఓ అల్లి సురేష్ తెలిపారు. సోమవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 5432 మంది విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల వస్తువులు వచ్చాయన్నారు. గతంలో పాఠశాలలు తెరిచిన తరువాత ఆలస్యంగా వచ్చాయన్నారు. ఈ ఏడాది పాఠశాలలు తెరవక ముందే పాఠశాలలకే విద్యాకానుకలు వచ్చాయన్నారు. గతంలో ప్రధానోపాధ్యాయులు మండల కేంద్రానికి వచ్చి తీసుకెళ్లారని, ఈ సారి పాఠశాలల వద్దకే వస్తువులను చేర్చడం జరిగిందన్నారు. భారత ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్ అనుమతులు వచ్చిన తరువాతనే విద్యార్థులకు బూట్లు, సాక్సులు, యూనిఫాం, బ్యాగులు, టైలు, బుక్స్ అందించడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి చదువుకోవడానికి కావాల్సిన అన్ని రకాల వస్తువులను అందించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే అన్నీ పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక వస్తువులను పంపిణీ చేయడం జరిగిందన్నారు.



వేమవరంలో విద్యా కానుక కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ శివాయాదవ్



బ్రాహ్మణపల్లి పాఠశాలలో విద్యా కానుక అందజేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు



జగనన్న విద్యా కానుకను అందజేస్తున్న వార్డు కౌన్సిలర్లు జాని, వెంకటేశ్వర్లు



జగనన్న విద్యా కానుక కిట్లును పంపిణీ చేస్తున్న నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ బడేజానీ

నేడు చౌడేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వేంచేసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయ 15 వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శీలం నారాయణ, పెద్దశెట్టి జోకా కొండలు సోమవారం తెలిపారు. ఉదయం 5 గం.లకు సుప్రభాత సేవ, 6 గం.లకు వేద పారాయణం, 7.30 గం.లకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 9 గం.లకు శాంతి హోమం, 10 గం.లకు అమ్మవారికి బోనాలు సమర్పణ, 11 గం.లకు అమ్మవారికి సహస్రనామార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేస్తారన్నారు. మధ్యాహ్నం 12గం.లకు వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

నేడు పోలేరమ్మ ఆలయం 11వ వార్షికోత్సవం

మంచికల్లు(రెంటచింతల): పల్నాటి కోనసీమగా పేరు పొందిన మంచికల్లు గ్రామంలో మంగళవారం గ్రామ దేవత అయిన శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం 11వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు సోమవారం తెలిపారు. ఉదయం 5 గంల నుంచి సుప్రభాతం, పంచామృతాభిషేకం, వివిధ రకాల అభిషేకాలు, పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12గం. లకు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనే వేలాదిమంది భక్తులకు మహాన్నదానం చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందాలని ఆయన కోరారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు.



చౌడేశ్వరి అమ్మవారు



పోలేరమ్మ అమ్మవారు

తిరిగి మున్సిపల్ చైర్మన్‌గా తురకా కిషోర్ బాధ్యతల స్వీకరణ

మాచర్ల: పట్టణ పురపాలక సంఘ మున్సిపల్ చైర్మన్‌గా మరోసారి తురకా కిషోర్ సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన బోయ రఘురామిరెడ్డి ఆ పదవికి రాజీనామా చేయగా, తిరిగి మున్సిపల్ చైర్మన్‌గా తురకా కిషోర్ బాధ్యతలు చేపట్టారు. రాత్రి సమయంలో మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు ఆధ్వర్యంలో బాధ్యతల స్వీకరణ కిషోర్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవులో వెళ్లిన తాను తిరిగి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. తనవంతుగా అన్ని వార్డులకు బాధ్యత ఉన్నంత వరకు అభివృద్ధికి చర్యలు చేపట్టి ముందుకెళ్తామన్నారు. సమష్టిగా మున్సిపాల్టిలో అన్నీ వార్డుల అభివృద్ధికి పీఆర్కే ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఎటువంటి మౌలిక వసతుల ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలుతో పాటు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డు కౌన్సిలర్లు గట్లా కోటిరెడ్డి, రామాంజ నేయరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మదార్‌సాహెబ్, సుభాని, మందా సంతోష్, చవ్వా బాలస్వామిరెడ్డి, ఎన్ శ్రీనివాసరావు, పోలా శ్రీను, కలివెల సురేష్, కోఆప్షన్ మెంబర్ షేక్ యాసిన్, అల్లి జీవన్, పురపాలక సంఘంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు కిషోర్‌ను అభినందించి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.



బాధ్యతలు స్వీకరించిన తురకా కిషోర్

తప్పనిసరిగా కౌలురైతు కార్డు తీసుకోవాలి

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి, ఇనిమెళ్ల గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో కౌలు రైతులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు పాల్గొని మాట్లాడుతూ కౌలుకు భూమిని సాగు చేసే ప్రతి ఒక్క రైతు కూడా కౌలు రైతు కార్డులు పొందాలని, కౌలురైతు కార్డుల ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయన్నారు. భూయజమానులు కౌలుదారులకు కౌలు కార్డు తీసుకోవడానికి సహకరించాలని, తద్వారా కౌలు రైతుకు పంటల బీమా, పంట రుణం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ఏదైనా విపత్తులో పంట నష్టపరిహారం పొందవచ్చన్నారు. యజమానులకు భూహక్కుకి ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సొంత పొలం లేని వారు కౌలు కార్డు ద్వారా రైతు భరోసా సాయం కూడా పొందవచ్చన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు లైసెన్స్ ఉన్న డీలర్ దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదును తీసుకొని జాగ్రత్తగా పంట కాలం పూర్తయ్యే వరకు దాచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.కె.యు. సల్మా, గ్రామ ఉద్యాన సహాయకులు పి. ఏలియా, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఈవో అప్పారావు

బాలకార్మికులను పనిలో ఉంచితే చట్టరీత్యా నేరం

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీ బాష

గురజాల : బాల కార్మికులు పనుల్లో ఉంచితే చట్టరీత్యా నేరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాష అన్నారు. స్థానిక కోర్టు భవనాలనందు సోమవారం పదమూడవ అదనపు జిల్లా జడ్జి ఇన్‌చార్జి చైర్మన్ ఓ వెంకట నాగేశ్వరరావు నరసరావుపేట వారి ఆదేశాల మేరకు జాతీయ బాల కార్మిక నిర్మూలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులైన బాలల వల్ల భావి భారతం ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలుస్తోందన్నారు. అదే విధంగా 14 సంవత్సరాల లోపు చిన్నారులను పనిలో పెట్టుకుంటే ఆ దుకాణం యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ర్యాలీ అనంతరం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సుందర జ్ఞానమ్మ, ఎస్ఐ బి అనంతలక్ష్మీ, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై రత్నకుమారి, న్యాయవాదులు కర్రా చిన కోటేశ్వరరావు, ప్రసాదరావు, కిరణ్ దాస్ తదితరులున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానీబాష

అనుమతి లేని విత్తనాలు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు

వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి

పిడుగురాళ్ల: ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి ఎస్. శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని పలు దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలనే అమ్మకాలు చేయాలని, నకిలీ విత్తనాలు అమ్మకాలు చేస్తే షాపులను సీజ్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వం అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని తెలియజేశారు. అంతే కాకుండా రైతులకు మాయమాటలు చెప్పి బిల్లులు లేకుండా విత్తనాలు అమ్మకాలు చేయరాదని, రైతులు కూడా విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మీరు కొనుగోలు చేసిన విత్తన రకం, ధర ఉన్న బిల్లును వెంటనే తీసుకోవాలని తెలియజేశారు. బిల్లులలో తేడా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకుని వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. అనంతరం విత్తన నమూనాలు సేకరించి సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు సంపడం జరుగుతుందన్నారు.



పట్టణంలోని ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది

పంట పొలంలో గుర్తు తెలియని మృతదేహం

రెంటచింతల: మండలంలోని పాలువాయిగేటు గ్రామ సమీపంలోని పంటపొలంలో ఓ గుర్తుతెలియని మృతదేహం సోమవారం వెలుగులోకి వచ్చినట్లు ఏఎస్ఐ పి.హనుమంతురావు తెలిపారు. ఆ పంట పొలానికి చెందిన రైతు వ్యక్తి మృతదేహాన్ని చూసి వెంటనే గ్రామస్తులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. వెంటనే ఘటనా స్థలానికి చురుకుని విచారించినట్లు మృతుని వయస్సు సుమారు 65 నుంచి 70 సం. వరకు ఉండవచ్చన్నారు. మృతుడు ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ ఉండేవాడన్నారు. ఆ వ్యక్తి 15 రోజుల కిందట మృతి చెందడం కారణంగా పూర్తిగా కుళ్లిపోయి గుర్తుపట్టడానికి కూడ వీలు లేకుండా ఉందని ఏఎస్ఐ తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

నరసరావుపేట టౌన్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్ అన్నారు. జాతీయ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమ వారం కోర్టు ప్రాంగణంలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ విద్యనందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. బడిఈడు పిల్లలను ఎవరైనా పనులలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదంపాల్

ట్రస్టు ఆధ్వర్యంలో కల్యాణ కానుక అందజేత



పిడుగురాళ్ల: పట్టణంలోని షాదిఖానా ఎదురు బజారులో నివాసం ఉంటున్న ఆలపాటి సీతారామయ్య బసవకుమారిల కుమార్తె విజయలక్ష్మీకి సోమవారం చింతలపూడి బ్రదర్స్ పెళ్లికానుక కిట్‌ను అందజేశారు. డాక్టర్ అశోక్‌కుమార్ బంగారపు తాళిబొట్టు పాటు పట్టుచీర, సారెను పెళ్లి కూతురు విజయలక్ష్మీకి ఇచ్చిదీవించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ



పిడుగురాళ్ల: మలేరియా వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్‌బి. మణికంఠ అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని సంజీవరెడ్డి నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సోమవారం మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి. మణికంఠ మాట్లాడుతూ వర్షం నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడవలెనని, మూడు రోజులకు మించి జ్వరం ఉన్నట్లయితే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని ఆయన తెలియజేశారు. మలేరియా టెస్టు చేయించుకుని మందులు వాడలని తెలియజేశారు. మలేరియా రహిత పట్టణంగా పిడుగురాళ్ల పట్టణాన్ని తయారు చేయడం కోసం పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ కోడెల శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ ఎస్కే రహీం, ల్యాబ్ టెక్నిషియన్ బి. శంకర్‌నాయక్, స్టాఫ్ నర్స్ ఎస్కే అమీర్, ఫార్మిసిస్టు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ స్టాంపులకు కొరత

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో రిజిస్ట్రేషన్ స్టాంపులకు కొరత ఏర్పడింది. దీనిని అవకాశంగా తీసుకున్న డాక్యుమెంటర్ రైటర్లు, స్టాంపు విక్రయదారులు కక్షిదార్ల వద్ద నుంచి అధిక ధరలు వసూలుచేస్తున్నారు. గత పదిరోజుల నుంచి ఉన్న ఈ సమస్య కొనసాగుతుంది. పది రూపాయల స్టాంపు పత్రం రూ.30లు నుంచి రూ.40లకు విక్రయిస్తున్నారు. రూ.50లు, రూ.100లు పత్రాలు దొరకటంలేదని కక్షిదార్లు వెల్లడిస్తున్నారు. కొంతమంది తమ వద్ద నున్న వందరూపాయల స్టాంపు పత్రం రూ.300లకు విక్రయిస్తున్నారు. వినియోగదారులకు ఇ–స్టాంపును అలవాటు చేసేందుకు ప్రతి రిజిస్ట్రేషన్‌లో ఎంతో కొంత ఇ– స్టాంపు ద్వారా దరఖాస్తు చేయాలని ఉత్తర్వులు ఇచ్చినట్లుగా కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు వెల్లడిస్తున్నారు.

ఆరంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండరోడ్డు శ్రీనివాసనగర్‌లో వేంచేసియున్న శ్రీగోదా పద్మావతీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 12వ మహా కుంభాభిషేక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధ్వజస్తంభంపై అర్చక స్వాములు సోమవారం గరుడ పతాకాన్ని ఎగురవేసి బ్రహ్మాది దేవతలను శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికారు. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజాధికాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి మల్లిపెద్ది సాంబశివరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారని జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కేంద్ర ఎన్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న జి–20 జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్య అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన చదువుతో పాటు జాబ్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్‌ను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఉన్నత అవకాశాలను ఒడిసి పట్టాలంటే నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.